




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 13-8-2025

సంపుటి: 21 సంచిక: 121

పేజీలు: 8 వెల: రూ.1


## జరిగింది పొరపాటు..
# చేస్తారా సర్దుబాటు?









- రాజకీయ రచ్చ సృష్టించిన నామినేటెడ్ జాబితా
- కాళింగ, కళింగ వైశ్య వర్గాల్లో ఎడతెగని చర్చ
- తప్పును గ్రహించి కళింగ కార్పొరేషన్ నియామకం రద్దు
- మొదలవలస రమేష్‌కు రాష్ట్రస్థాయి సంస్థ ఇచ్చే ఛాన్స్
- జిల్లాలో పెండింగు పదవులకూ పలువురి యత్నాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా మొదలవలస రమేష్.. ఈ పదవి, ఈ నాయకుడు ట్రోల్ అయినట్టుగా ఈమధ్య కాలంలో జిల్లా లో ఇంకెవరూ కాలేదు. రాష్ట్రంలో 31 కుల కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో పొందర కుల కార్పొరేషన్ చైర్మన్ పదవి శ్రీకాకుళం జిల్లాకే వచ్చిందని.. ఇప్పటికే ఒక కార్పొరేషన్ చైర్మన్ పదవి ఉన్న నరసన్నపేట నియోజక వర్గానికి మరో పదవి రావడం హర్షదాయకమని భావించిన సమయంలో జాబితాలో కాస్త కిందికి దిగితే కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా ఆమదాలవలసకు చెందిన మొదలవలస రమేష్ పేరు కనిపించింది. ఇది పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. కాళింగ సామాజిక వర్గానికి చెందిన మొదలవలస రమేష్‌ను కళింగకోమటి కులంలో చేర్చడం పై స్వయంగా టీడీపీలోనే గందరగోళం ఏర్పడింది. అత్యంత బలమైన డేటాబేస్ ఉన్న టీడీపీలో కాళింగులకు, కళింగవైశ్యులకు తేడా తెలియకుండా మొదలవలస రమేష్‌ను ఎలా నియమిం చారనే చర్చ హోరెత్తగా, కాళింగుల వాట్సప్ గ్రూపుల్లో దీనిపై కామెడీ, సెటైర్లతో కూడిన జోకులు కనిపించాయి. ఇప్పటికే కాళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా నరసన్నపేటకు చెందిన రోణంకి కృష్ణంనాయుడును నియమించినందున మొదలవలస రమేష్‌కు కళింగకోమటి సంఘానికి అధ్యక్షుడిని చేశారని కొందరు, తమ కుల కార్పొరేషన్‌కు ఇంతవరకు చైర్మన్‌ను ప్రకటించకపోగా, కాళింగులకు చెందిన మొదలవలస రమేష్‌ను చైర్మన్‌గా తమపై రుద్దడ మేమిటని కళింగ కోమట్లు మంగళవారమంతా మల్లగుల్లాలు పడ్డారు.

**రాజకీయ, సామాజిక వర్గాల్లో గందరగోళం**

దీనికి తోడు బుధవారం ఉదయం ప్రముఖ దినపత్రికలో తనను కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు తెలుగుదేశం పార్టీకి కృతజ్ఞతలు తెలుపుతున్నా నంటూ మొదలవలస రమేష్ ప్రకటించినట్లు ఒక వార్త వచ్చింది. అంతవరకు ఇదేదో పొరపాటున ప్రకటించి ఉంటారని, బుధవారానికి సరిదిద్దు కుంటారని కళింగకోమట్లు భావించారు. కానీ దీన్ని స్వాగతిస్తున్నట్టు ఒక పత్రికలో రమేష్ ఫొటోతో వార్త రావడంతో పొలిటికల్ సర్కిల్స్‌లో గందరగోళం ఏర్పడింది. వాస్తవానికి మొదలవలస రమేష్‌ను కాళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ గతంలో పార్టీకి సూచించారు. చివరి నిమిషం వరకు ఆయన పేరే వినిపించింది. కానీ మంత్రి అచ్చెన్నాయుడు జోక్యంతో రోణంకి కృష్ణంనాయుడును ఆ పదవి వరించింది. దీంతో మొదలవలసకు మరో విడతలో అవకాశం ఇవ్వాలన్న భావనతో పార్టీ ఉంది. ఆ మేరకు 31 నామినేటెడ్ పదవుల జాబితాలో ఆయన పేరు ఉన్నా, అది కూడా తప్పుడు కాలమ్‌లో ఉండటంతో కాళింగ కార్పొరేషన్ చైర్మన్‌నే మార్చారని, అయితే కాళింగ కార్పొరేషన్ బదులు కళింగ కోమటి కార్పొరేషన్ అని తప్పుగా టైపింగ్ జరిగిందేమోనని అందరూ తొలుత భావించారు. కానీ రెండింటిలో ఏదీ కరెక్ట్ కాదు. వాస్తవానికి మరో 20 కులాలకు సంబం ధించిన కార్పొరేషన్ చైర్మన్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. మంగళవారం ప్రకటించిన 31 కార్పొరేషన్ల జాబితాలో కొన్ని కులాలు లేకపోవడం వల్ల టీడీపీ మంగళగిరి పార్టీ కార్యాలయంపై ఒత్తిడి పడింది. ఈ నెల 16లోగా వీటిని భర్తీ చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం నుంచి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సహా టీడీపీ సీనియర్లు దీనిపై కసరత్తు ప్రారంభించారు. కళింగకోమటి కార్పొరేషన్ చైర్మన్‌గా తన పేరు ప్రకటించినట్లు మొదలవలస రమేష్‌కు తెలియదు. అప్పటికి తిరుపతిలో ఉన్న ఆయన ఈ విషయం తెలిసిన తర్వాత తిరుగు ప్రయాణంలో విజయవాడలో దిగి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడికి జిల్లాలో జరిగిన రచ్చను వివరించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా అమెరికా పర్యటనలో ఉండటం వల్ల మొదలవలస చైర్మన్‌గిరీపై పార్టీకి స్పష్టత లేకుండాపోయింది. అయితే అంతకు ముందే పార్టీ తన తప్పును గ్రహించి 31 పోస్టుల్లో 30 మాత్రమే అమలులో ఉన్నాయని, ఒక పోస్టును రద్దు చేస్తున్నట్టు మంగళవారం రాత్రే ప్రకటించింది.

**ఆ పదవులకు తీవ్ర పోటీ**

జిల్లాకు సంబంధించి శిష్టకరణాలు, పోలినాటి వెలమ కులాలకు కార్పొరేషన్ చైర్మన్లను ప్రకటించ లేదని.. అసలు ప్రభుత్వానికి ఆ ఉద్దేశం ఉందో లేదోనన్న ప్రచారం జరుగుతోంది. వెలమల్లో కొప్పుల వెలమ కార్పొరేషన్ పోస్టును ప్రభుత్వం ఇంతకు ముందే భర్తీ చేసింది. మిగిలింది పోలినాటి వెలమలే. వీరికి కూడా ఒక కార్పొరేషన్ ఉండాలని జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాల్లో ఉన్న వెలమలు పట్టుపడుతున్నారు. అదే సమయంలో ఇక్కడ ఒక కేంద్రమంత్రి, ఒక రాష్ట్రమంత్రి పదవులు ఈ సామాజికవర్గానికి ఉన్నాయని, అంతకంటే ముందు మిగిలిన కులాలకు కార్పొరేషన్లు వేయాలని కోరినవారూ లేకపోలేదు. చంద్రబాబు ప్రభుత్వం కూడా కుల కార్పొరేషన్ల పేరుతో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తుందని తెలిసిన వెంటనే ముందుగా సిఫార్సు లేఖలకు ఎగబడినవారు పోలినాటి వెలమలే. వైకాపా హయాంలో ఈ రెండు వెలమ కులాలకు రెండు వేర్వేరు కార్పొరేషన్లు ఇచ్చారు. అందులో ఒకటి ఎస్.కోటకు, మరొకటి నరసన్నపేట నియోజక వర్గానికి కేటాయించారు. సంఖ్యాపరంగా చూసు కుంటే నరసన్నపేట నియోజకవర్గంలోనే పోలినాటి వెలమలు ఎక్కువగా ఉన్నారు. కానీ జిల్లా వ్యాప్తంగా ఈ పదవి కోసం తీవ్రమైన పోటీ ఉంది. కోట బొమ్మాళికి చెందిన వెలమల కామేశ్వరరావు ఈ పదవిపై కన్నేశారు. అయితే అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడుల సొంత నియోజకవర్గానికి చెందినవారే కావడం వల్ల వెనక్కు తగ్గాల్సివస్తోంది. నరసన్నపేట టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న శిమ్మ చంద్ర శేఖర్ కూడా ఈ పదవి కోరుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఈయన్ను

- మిగతా చివరి పేజీలో

## ఇచ్చుకో వంద..
# ఇదీ అక్కడి దందా!

- వసూళ్లు మరిగిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది
- నిర్దేశిత ఫీజులతోపాటు కొసరు ఇవ్వాల్సిందే
- ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఎల్‌పీఎం కావాలని కొర్రీలు
- జీపీ ఆధారిత లావాదేవీల్లోనూ అవకతవకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆ కార్యాలయంలో అందించే సేవలకు నిర్దేశిత ఫీజులతోపాటు కొసరుగా కొంత సమర్పించుకుంటేనే పనులు జరుగుతాయి. అవసరమైన పత్రాలు చేతికందుతాయి. సేవ ల్లోనూ విపరీత జాప్యం జరుగుతోంది. సబ్ రిజిస్ట్రార్లు అనవసర కొర్రీలతో రిజిస్ట్రేషన్లలో జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. అలాగే జీపీ రిజిస్ట్రేషన్లలో అవక తవకలు జరుగుతున్నట్లు తెలిసింది. శ్రీకా కుళంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే కాకుండా జిల్లాలోని అన్ని కార్యాలయా ల్లోనూ ఇదే దుస్థితి ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ లో అందించే పౌరసేవలకు చెల్లించాల్సిన ఫీజులు, ఆ సేవలు, పత్రాలు ఇచ్చేందుకు పట్టే గరిష్ట సమయాన్ని నిర్దేశించే సిటిజన్ చార్టర్ అమల్లో ఉంది. ఆ మేరకు కార్యాల యాల ఆవరణల్లో వాటి వివరాలతో కూడిన బోర్డులు ఉంటాయి. కానీ అవన్నీ నామ మాత్రమే.. అలంకారప్రాయమే. ఇక్కడ జరిగే తంతు అంతా వాటికీ అతీతంగానే ఉంటుందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తు న్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పౌరసేవలు మరింత భారంగా మారుతున్నాయి. ఈసీ, మార్కెట్ వాల్యూ పత్రాల జారీకి నిర్దేశించిన రుసుము కంటే అదనంగా వసూలు చేస్తు న్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 30 ఏళ్లు పైబడిన ఆస్తులకు సంబంధించి ఈసీ, సీసీ, మిగతా సేవలకు రూ.500 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 30 ఏళ్లలోపు ఆస్తు లకైతే ఇవే సేవలకు రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వీటికి అదనంగా రెండు సందర్భాల్లోనూ రూ.100 యూజర్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుసు ములు అధికారికం. అయితే ఇవి చెల్లించి నంతమాత్రాన మనం కోరుకున్న పత్రాలు ఇచ్చేయరు. వాటిని ఇచ్చే ఉద్యోగులను, అధికారులను సంతృప్తిపరచాలి. ఇందు కోసం ప్రతి సేవకు నిర్దేశిత ఫీజులతోపాటు అదనంగా రూ.100 చేతిలో పెడితేనే కావ లసిన ధ్రువపత్రాలు ఇస్తున్నారు. అంటే రూ.600 చెల్లించాల్సినచోట రూ.700, రూ.300 చెల్లించాల్సిన చోట రూ.400 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది గుంజు తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నా రు. మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్‌కు రూ.50 చెల్లిస్తే సరిపోతుంది. కానీ వినియోగదారుల నుంచి రూ.100 వసూలు చేస్తున్నారు. అద నంగా డబ్బులు తీసుకుంటున్నందున సకా లంలో సర్టిఫికెట్లు ఇస్తున్నారా అంటే అదీ లేదు. ఈసీ, మార్కెట్ వాల్యూ ధ్రువపత్రాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్దేశించిన సమయం పది నిమిషాలు. కానీ స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది వాటికి 12 గంటల సమయం తీసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే తంతు సాగుతుందని వినియోగదారులు ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు. ఈసీ, మార్కెట్ వాల్యూ పత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే ఇవ్వాల్సిన సమాచారంతో పాటు విని యోగదారుడికి అవసరంలేని బోల్డంత సమాచారం

- మిగతా చివరి పేజీలో




• ఎడిటోరియల్

# కుక్కలా.. మనుషులా.. ఎవరు ముఖ్యం?

ఊరకుక్కలను వీధుల్లో ఉంచరాదని సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై జంతు ప్రేమికులు విరుచుకుపడుతున్నారు. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో వీధి కుక్కల బెడదకు సంబంధించిన కేసులో తీర్పునిచ్చిన న్యాయమూర్తులకు జాలి, దయ, కరుణ లేవా? అని ప్రశ్నిస్తున్నారు. కుక్కలు కూడా మనుషుల్లాంటివేనని.. వాటికీ ఈ సమాజంలో జీవించే హక్కు ఉందని, కానీ నోరు లేని విశ్వాసపాత్రమైన ఆ జీవులను నిర్దయగా ఊరవతలికి తరిమేసి.. షెల్టర్లలో నిర్బంధించమనం తీవ్ర అన్యాయమని ఆక్రోశిస్తున్నారు. కానీ అవే కుక్కలు వీధుల్లో స్వైరవిహారం చేస్తూ మనుషులపై పడి పిక్కలు పీకేయడం, తీవ్ర గాయాల పాల్జేస్తుంటే మాత్రం స్పందించరు. గుంపులు గుంపులుగా తిరుగుతూ ఆ ప్రాంతం తమదే అన్నట్లు గ్రామసింహాలు రెచ్చిపోతున్న ఘటనలు ఒక్క ఢిల్లీలోనే కాకుండా దేశంలోని ప్రతి గ్రామం, పట్టణంలోనూ కనిపిస్తాయి. వాటి మానాన అవి తిరిగితే ఏ గొడవా ఉండదు.. ఎవరికీ ఇబ్బంది ఉండదు. కానీ ఆ మార్గంలో మనుషులు వెళితే చాలు.. ఒక్కుమ్మడి వారి వెంటపడతాయి. భయపడి వారు పరుగులు తీస్తే మీద పడి కండలు పీకేస్తాయి. ఇక ద్విచక్ర వాహనదారులు ఈ శునక సమూహాల దాడి నుంచి తప్పించుకునేందుకు ఒక్కసారిగా వాహనాల స్పీడు పెంచి ప్రమాదాల పాలవుతున్న ఘటనలు కూడా ఉన్నాయి. అలాగే ఇళ్ల ముంగిట ఉన్న ముక్కుపచ్చలారని పసిపిల్లలను కుక్కలు నోటకరుచుకుని ఈడ్చుకుపోతున్న ఉదంతాలు ఇటీవలి కాలంలో చాలానే జరుగుతున్నాయి. టీకాలు వేయని కుక్కల కాటుకు గురైనవారు ర్యాబిస్ వ్యాధి బారిన పడుతున్నవారు పెద్దసంఖ్యలో మరణిస్తున్న సో కాల్డ్ జంతు ప్రేమికులు ఏమాత్రం స్పందించరు. కుక్కలను ఏమీ చేయవద్దని ప్రచారం చేస్తారే తప్ప.. వాటివల్ల మనుషులకు జరుగుతున్న హాని గురించి మాట్లాడరు. నిజమే.. మనుషుల్లాగే కుక్కలు కూడా జీవులే. వాటికీ జీవించే హక్కు, స్వేచ్ఛ ఉన్నాయి. కానీ వాటి వల్ల ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేనప్పుడు.. వాటిని ఎవరూ ఏమీ అనరు. పట్టించుకోరు. కానీ కుక్కలు మీద పడి కరిచేస్తుంటే, ప్రాణాలు తీస్తున్నా కూడా వాటిని ఏమీ అనకుండా పోనీలే వదిలేయడం, వాటి మానానా అవే పోతాయిలే అనుకోవడం.. తనకు మాలిన ధర్మమే అవుతుందన్నది ఈ జంతు ప్రేమికులకు అర్థం కాదు. అంతెందుకు.. సాటి మనుషులెవరైనా తమ మీదికి దాడికి వస్తే.. దాడి చేసి గాయపరిస్తే.. వీరు ఊరుకుంటారా? ఎంతమాత్రం కాదన్నది వాస్తవం. తమ శక్తికి మించి ఎదుటి వ్యక్తుల దాడి నుంచి తప్పించేందుకు ప్రయత్నిస్తారు. అది కుదరనప్పుడు ఎదురుదాడికి దిగి వారిని కొట్టడానికి ప్రయత్నిస్తారు. దీన్నే ఆత్మరక్షణ అంటారు. సాటి మనిషి విషయంలోనే ఇలా ప్రవర్తించినప్పుడు.. కుక్కలు దాడికి పాల్పడి, ప్రాణాలు తీస్తున్నా వీలైన రక్షణ చర్యలు తీసుకోకుండా వాటిని అలాగే స్వేచ్ఛగా వీధుల్లో తిరగనివ్వాలనడం ఏం న్యాయమో జంతు ప్రేమికులు ఆలోచించాలి. ఈ కేసులో జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కూడా ఇచ్చిన తీర్పు ఏమాత్రం నిర్హేతుకంగా, అసమంజసంగా లేదు. వీధికుక్కలను 'కనిపిస్తే కాల్చివేయండి' అని ఆదేశించలేదు. అసలు వీధికుక్కలను జనావాసాల నుంచి పూర్తిగా తరిమికొట్టాలని, నాశనం చేయాలని అసలు చెప్పలేదు. వాటిని జనావాసాలకు వీలైనంత దూరంగా ఉంచాలని మాత్రమే నిర్దేశించింది. కుక్కల కోసం పరితపిస్తున్న జంతు ప్రేమికులు.. రేబిస్ బారిన వారిని ఆదుకోగలరా? ఆ వ్యాధితో మరణించినవారిని వెనక్కి తీసుకురాగలరా? అని ధర్మాసనం సూటిగా ప్రశ్నించడంలో ఏమాత్రం తప్పులేదు. పట్టుకున్న వీధికుక్కలను డాగ్ షెల్టార్లకు తరలించి ఆశ్రయం కల్పించాలని, అక్కడ వాటిని పట్టుకొని స్టెరిలైజేషన్ చేయించడం ద్వారా వాటి సంతతి పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. వాటికి రోగనిరోధక శక్తి అందించే నిపుణులను అందుబాటులో ఉంచాలని, షెల్టర్ల నుంచి కుక్కలను బయటకు వదలకూడదని, అవి తప్పించుకోకుండా చూసుకోవడానికి కాపలా పెట్టడంతో పాటు, సీసీటీవీలు ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. కుక్క కాటు కేసుల కోసం ఒక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించాలని కూడా అధికారులకు సూచించింది. అయినా కోర్టు వాటి జీవిక హక్కును హరించేసినట్లు జంతు ప్రేమికులు.. ముఖ్యంగా సెలబ్రిటీలు గగ్గోలు పెడుతున్నారు. స్వయంగా అనుభవిస్తే తప్ప వారికి వీధికుక్కలతో ఎంత బాధో అర్థం కాదు.

## సమరయోధులు స్ఫూర్తితో ముందుకు సాగాలి



(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

దేశం కోసం అసువులు బాసిన స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో నేటి తరం యువత ముందుకు సాగాలని ఇచ్ఛాపురం ప్రభుత్ర జూనియర్ కళాశాల (బాలురు) ప్రిన్సిపాల్ సీహెచ్ శరత్‌బాబు అన్నారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ (బాలికలు) కళాశాలలో మంగళవారం నియోజకవర్గస్థాయిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కె.జి.బి.వి, అదర్శ పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం విభాగంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రిన్సిపాల్ వి.శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శరత్‌బాబు మాట్లాడుతూ ఎంతో మహోన్నతమైన మన సాంస్కృతిక వారసత్వాన్ని తరువాత తరాల వారికి అందించాల్సి భాద్యత యువతపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ శంకరరావు మాట్లాడుతూ ప్రస్తుత యువత దేశ నవ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.

## నైట్ షెల్టర్‌లో అన్నప్రసాదం అందిస్తాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అన్నప్రసాదసేవలు కొనసాగిస్తామని, ప్రతి మంగళవారం నైట్ షెల్టర్‌లో నిస్సహాయులకు అన్నప్రసాదం అందిస్తామని, అక్షయ సేవాసమితి సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నప్రసాద వితరణలో భాగంగా జిల్లాలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో తమ సంస్థ చేస్తున్న కార్యక్రమాల్లో భోజనాల పంపిణీ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా జరుగుతున్నట్లు, అధ్యక్షులు బోడిగి మధు తెలిపారు. షెల్టర్ నిర్వాహకురాలు, చేయుతమేమున్నాం అధ్యక్షురాలు వైశ్యరాజు వెంకటలక్ష్మి, సేవకులు ఉర్లం శివతేజ పట్నాయక్ పిలుపుమేరకు మంగళవారం అన్నప్రసాద వితరణ చేపట్టామని, సహాయకులు నంది ఉమాశంకర్, పొడుగు చరణ్, బొట్టా సాయికుమార్, సుప్రజ రౌత్, బాడీబిల్డర్ విజయ్‌కుమార్ ప్రతినిత్యం అన్నసేవలు కొనసాగిస్తుండటం హర్షణీయమన్నారు. అనంతరం పలు ముఖ్య కూడలిలో పేదలకు ఆహారాన్నందించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కిరణ్‌కుమార్, రావాడ రాజశేఖర్, శ్రీనివాసరావు, మణికుమార్, సురేష్‌కుమార్‌లు పాల్గొన్నారు.



## 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలతో పాటు అనాథలు, హెచ్‌ఐవి బాధితులు, విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు 25% కోటా కింద రాష్ట్రంలోని ప్రైవేటు, అన్-ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ ఎపిసి డా. ఎస్.శశిభూషన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఆధార్, ప్రాథమిక వివరాలతో https://cse.ap.gov.inలో రిజిస్టర్ చేయవచ్చునీ, లేదా గ్రామ సచివాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, పాఠశాల ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీట్లను లాటరీ ద్వారా కేటాయిస్తారనీ వివరించారు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నంబర్: 1800 425 8599, ఆర్టీఈ జిల్లా నోడల్ అధికారి నంబర్ 9440484672లో సంప్రదించవచ్చని ఈ సందర్భంగా ఆయన సూచించారు. దరఖాస్తుతో పాటు చిరునామా ధృవీకరణ పత్రం, జనన ధృవీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు.

## ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న దాదాపు 19శాఖల సంఘాలను వారి నాయకత్వాన్ని కలుపుకుంటూ ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటైంది. చైర్మన్‌గా బూరాడ మధుబాబు ఎన్నికయ్యారు. అదే విధంగా అసోసియేట్ చైర్మన్ - బగ్గా జగదీష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా జి.రాజ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పిల్లి హరీష్, ట్రెజరర్‌గాసురేంద్ర, పబ్లిసిటీ సెక్రటరీగా పులిబండ్ల నరసింహారావు, కో- చైర్మన్లుగా వెంకటేశ్వర్లు, సంగయ్య, యేసురత్నం, రవి, సురేష్‌లు, వైస్ చైర్మన్లుగా బి.రవితేజ, స్నేహలత, ఆంజనేయులు, మహేష్ నాయుడులు ఎన్నికయ్యారు. అనంతరం చైర్మన్ మధుబాబు మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను ఐక్యం చేస్తూ జోన్ల వారిగా మహాసభలు నిర్వహిస్తామనానరు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక దీర్ఘకాలిక ఆర్థిక, ఆర్థికేతర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## దేశభక్తి శ్రీకాకుళం వారసత్వంలోనే ఉంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

"దేశభక్తి" శ్రీకాకుళం వారసత్వంలోనే ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం వజ్రోత్సవాలలో భాగంగా నిర్వహించిన రన్ ఫర్ రన్ మారథాన్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే శంకర్ బుధవారం జెండా ఊపి రన్ ఫర్ రన్ ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాలనుండి, ఏడు రోడ్ల కూడలి వరకు కొనసాగింది. అనంతరం గొండు శంకర్ జిల్లా అధికారులతో కలసి మాట్లాడుతూ శ్రీకాకుళం అంటే దేశభక్తి, దేశభక్తి అంటే శ్రీకాకుళం అనే విధంగా ఈ రోజు కార్యక్రమం జరిగిందన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎన్నో మైలురాళ్ళను దాటి దేశంలో సుస్థిరస్థానం సంపాదించిందని, అన్నిరంగాల్లో శ్రీకాకుళం ముందుందని, జిల్లా చరిత్రలో చిరస్మరణీయమైన మైలురాయిగా నిలవటంలో మహనీయుల కృషి, సేవలు వెలకట్టనివని కొనియాడారు. శ్రీకాకుళం వజ్రోత్సవాలలో భాగంగా జిల్లా కలెక్టర్ పిలుపుమేరకు జిల్లా అధికారులు, ప్రముఖులు, వైద్యులు, న్యాయవాదులు, మున్సిపల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు చురుకుగా పాల్గొనటం ఆనందాన్నిచ్చిందన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎందులోనూ తీసిపోదని, రానున్న రోజులలో కూటమిప్రభుత్వ సహకారంతో అభివృద్ధిని చూస్తారన్నారు. అందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, లోకేష్‌బాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్వచ్ఛందసంస్థలు, జిల్లా ప్రముఖులు, వక్తలు, టీడీపీ నాయకులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# సత్యదేవ్ జాతకం మహేష్ మారుస్తాడా?

మహేష్ బాబు జీఎంబి ఎంటర్‌టైన్‌మెంట్ తో పేరుతో ఓ బ్యానర్ పెట్టారు. నమ్రత ఈ బ్యానర్‌ని యాక్టివ్‌గా నడపాలని భావించారు. అయితే అనుకున్నంత క్రియాశీలంగా సినిమాలు రెడీ కావడం లేదు. గతంలో 'మేజర్' సినిమా ఈ బ్యానర్‌లో వచ్చింది. చాలా గ్యాప్ తర్వాత మరో సినిమాను తీసుకొస్తున్నారు. అదే రావు బహదూర్. సత్యదేవ్ హీరో. కేరాఫ్ కంచరపాలెం, ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య చిత్రాలతో ఒరిజినల్ ఫిల్మ్ మేకర్‌గా పేరుతెచ్చుకున్న వెంకటేష్ మహా దర్శకుడు.

తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ వదిలారు. ఇదొక సైకాలజికల్ డ్రామా. ఓ రాజవంశం నేపథ్యంలో జరిగే కథ. రాజవంశీకుడి గెటప్‌లో సత్యదేవ్ లుక్ కొత్తగా ఉంది. మహేష్ బాబు, నమ్రత ఈ సినిమాను సమర్పిస్తున్నారు. చింతా గోపాలకృష్ణ రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మాతలు. ఆగస్ట్ 15న టీజర్ వదులుతున్నారు.

సత్యదేవ్ టాలెంట్‌కి లోటు లేదు. ఏ పాత్రనైనా చేయగలడు. గాడ్ ఫాదర్, కింగ్‌డమ్ లాంటి సినిమాల్లో చేసిన పాత్రలకు మంచి పేరు వచ్చింది గానీ అవి కెరీర్‌కి కలిసిరావడం లేదు. హీరోగా వచ్చిన సినిమాలు నిలబడటం లేదు. ఇలాంటి సమయంలో మహేష్ బాబు ప్రెజెంటర్‌గా సినిమా చేస్తున్నాడు. మహేష్ హస్తవాసి మంచిది. మేజర్ సినిమాకు నేషనల్ లెవల్‌లో మంచి పేరు వచ్చింది. ఇప్పుడు సత్యదేవ్‌కి ఓ విజయం కావాలి. రావు బహదూర్ ఆ విజయాన్ని ఇస్తుందేమో చూడాలి.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...







కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్.. ఇప్పుడు కూలీ మూవీతో మరికొన్ని గంటల్లో సందడి చేయనున్న విషయం తెలిసిందే. పవర్ఫుల్ గ్యాంగ్ స్టర్ డ్రామాగా స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఆ సినిమా పాన్ ఇండియా రేంజ్ లో రిలీజ్ కానుంది. ఆగస్టు 14వ తేదీ అంటే రేపే వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ భారీ బడ్జెట్ తో నిర్మించిన కూలీ సినిమాలో అనేక స్టార్ నటీనటులు కనిపించనున్నారు. టాలీవుడ్ కింగ్ నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నారు. అమీర్ ఖాన్, శ్రుతి హాసన్, సాబిన్ సాహిర్, ఉపేంద్ర, సత్యరాజ్, మహేంద్రన్ తదితర నటీనటులు ముఖ్యపాత్రల్లో ఆడియన్స్ ను కనువిందు చేయనున్నారు. అయితే ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. మేకర్స్ రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ వేరే లెవెల్ లో హైప్ క్రియేట్ చేసింది. పాటలు, ట్రైలర్ సినిమాపై ఉన్న అంచనాలను తాకేలా చేసింది. కూలీతో లోకేష్ మరో సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించారని అంతా ఫిక్స్ అయ్యారు. పక్కా బ్లాక్ బస్టర్ బొమ్మ అని డిసైడ్ అయ్యారు. అంతలా కూలీ మూవీపై బజ్ ఉంది. అయితే గత కొంతకాలంగా రిలీజ్ కు ముందు ఇంత హైప్ క్రియేట్ చేసుకున్న సినిమా ఇదేనని చెప్పాలి. రజినీ కెరీర్ లో కూడా అంతే. ఎందుకంటే ఆయన నటించిన వివిధ సినిమాలు రీసెంట్ గా మెప్పించలేకపోయాయి. జైలర్ తప్ప పేట, పెద్దన్న, వేట్టయాన్ వంటి చిత్రాలకు అసలు హైప్ కనపడలేదు. కానీ ఇప్పుడు కూలీ యమా హైప్ తో రిలీజ్ కానుంది. ఇప్పుడు విడుదలకు ముందే రూ.100 కోట్ల క్లబ్ లోకి చేరనున్నట్లు కనిపిస్తుంది. ఇప్పటికే మేకర్స్ అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్ చేయగా.. ఓ రేంజ్ లో జరుగుతున్నాయి. దీంతో ఇప్పటి వరకు రూ.70 కోట్లకు పైగా కూలీ మూవీ.. అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా రాబట్టినట్లు తెలుస్తోంది. ఇంకా రిలీజ్‌కు కొన్ని గంటల సమయం ఉంది కాబట్టి రూ.100 కోట్లు రాబట్టడం పక్కాలా ఉందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే కూలీ ఓపెనింగ్స్ రూ.150 కోట్లు సాధించే అవకాశం ఉంటుందనే చెప్పాలి. మొత్తానికి ఫస్ట్ షో పడడానికి ముందే ప్రతిష్టాత్మక క్లబ్ లోకి కూలీ వెళ్లేలా కనపడడం విశేషం. సినిమాకు పాజిటివ్ టాక్ వేస్తే దూకుడు వేరు. రూ.1000 కోట్ల మార్క్ కూడా టచ్ చేసే ఛాన్స్ ఉంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

## రజినీ 'కూలీ'.. రిలీజ్ కు ముందే రూ.100 కోట్లు?

## ముంబై కంటే హైదరాబాద్ బిర్యానీ ఫేమస్!

హైదరాబాద్ దమ్ బిర్యానీకి ఫిదా కానిదెవరు? భాగ్యనగరంలో కాలు మోపిన ఎవరైనా హైదరాబాద్ బిర్యానీ రుచి చూడాల్సిందే. కామన్ మ్యాన్ అయినా? సెలబ్రిటీ అయినా బిర్యానీ తినకుండా తిరుగు ప్రయాణ మయ్యేదే లేదు. అదీ హైదరాబాద్ బిర్యానీకి ఉన్న ప్రత్యేకత. వరల్డ్ లోనే హైదరాబాద్ బిర్యానీ ఫేమస్. తాజాగా సోషల్ మీడియా క్వీన్ ఉర్ఫీ జావెద్ ముంబై...హైదరాబాద్ బిర్యానీ మధ్య వత్యాసం చెప్పే ప్రయత్నం చేసింది. ముంబై బిర్యానీ అన్నది పులావ్ లా ఉంటుంది. అందులో ఆయిల్ తప్ప ఇంకేమీ ఉండదు. కానీ హైదరాబాద్ బిర్యానీ రుచే వేరుగా ఉంటుంది. పేరు పెట్టాల్సిన పనిలేదు. చాలా రుచికరమైన ఫుడ్ అనేసింది. అయితే సీ ఫుడ్స్ మాత్రం హైదరాబాద్ కంటే ముంబైలోనే బాగుంటాయంది. ముంబై కోస్టల్ తీరం కావడంతో అన్నిరకాల చేపలు అందుబాటులో ఉంటాయి. వాటితో రకరకాల స్పెషల్ ఐటమ్స్ తయారవుతుంటాయి. కానీ హైదరాబాద్‌కి ఆ ఛాన్స్ లేదు. సీ ఫుడ్స్ ఇష్టపడేది కూడా చాలా తక్కువ మందే. ఆరకంగా సీ ఫుడ్స్ అక్కడ ప్రత్యేకం కాలేకపోయాయి. బిర్యానీ.. చికెన్..మటన్ ఐటమ్స్ కు మాత్రం భాగ్యనగరం ఎప్పటికీ ప్రత్యేకమే. ఇటీవలే హైదరాబాద్ విచ్చేసిన బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ కూడా హైదరాబాద్ బిర్యానీ గురించి రివ్యూ కూడా ఇచ్చారు. ఇక్కడ బిర్యానీ టెస్ట్ ఇంకెక్కడా ఉండదన్నారు. అలాగే యంగ్ టైగర్ ఎన్టీఆర్ బిర్యానీ మాత్రం హైదరాబాద్ బిర్యానీ రుచిని మించి ఉంటుదన్నట్లు పబ్లిక్ వేదికపైనే స్పందించారు. ఇంకా సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, రణబీర్ కపూర్, అమితాబచ్చన్ లాంటి బాలీవుడ్ స్టార్లు ఎంతో మంది హైదరాబాద్ బిర్యానీ గురించి ఎన్నో సందర్భాల్లో ముచ్చటించారు. ముంబై, కేరళ, బెంగుళూరు, చెన్నై నుంచి దుగుమతైన భామలు కూడా భాగ్యనగరం నాన్ వెజ్ వంటకాలపై స్పెషల్ రివ్యూలు ఇచ్చిన వారే.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...






# లీపు సెకెండ్‌కు ఇక.. సెలవ్!

- -భూ భ్రమణంలో వ్యత్యాసాలతో రోజు వ్యవధిలో తేడాలు
- -వాటిని సరిచేసేందుకు యూటీసీ ప్రక్రియ
- -చరిత్రలో ఇంతవరకు తొలగించిన సందర్భాలు నిల్
- -ఇంతవరకు 27 సందర్భాల్లో అదనపు సెకండ్ల చేరిక

**(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)**

ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఒక అసాధారణ, అరుదైన అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. భూభ్రమణం సాధారణ స్థాయి కంటే కాస్త వేగం పుంజుకోవడమే సదరు అసాధారణ పరిణామం. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ఒక రోజులో ఉండే కో ఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్(యూటీసీ) నుంచి ఒక సెకండు తగ్గించాలని శాస్త్రవేత్తలు, కాలాన్ని కొలిచే నిపుణులు భావిస్తున్నారు. వాస్తవానికి ఇదేమీ కొత్త విషయం కాదు. 2022లోనే దీనిపై చర్చించిన అంతర్జాతీయ నిపుణులు 2035లో ఒక సెకను తగ్గించాలని నిర్ణయించారు. కానీ ప్రస్తుతం భూభ్రమణ వేగం పెరుగుదల చూస్తే.. దాని కంటే ముందే ఆ పని చేయాల్సి వస్తుందేమోనని అభిప్రాయపడుతున్నారు. చరిత్రలో ఒక సెకండును తగ్గించడం ఇదే తొలిసారి అని అంటున్నారు. భూభ్రమణ వేగంలో వ్యత్యాసాల కారణంగా సెకండ్లను కలిపిన సందర్భాలు ఉన్నా.. ఇప్పటివరకు తొలగించే అవసరం మాత్రం రాలేదు. ఇలా కలపడం లేదా తొలగించే సెకండ్లనే లీపు సెకండ్లని అంటుంటారు.

## ఏమిటీ లీపు సెకండు

భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతూనే తన చుట్టూ తాను తిరుగుతుందని.. ఈ పరిభ్రమణం ఆధారంగానే రోజులు, నెలలు, సంవత్సరాలు గణిస్తారని మనం చిన్నప్పుడే సైన్ పాఠాల్లో చదువుకున్నాం. భూమి తన ఇరుసుపై తిరుగుతుంటుంది. ఇలా తన చుట్టూ తాను ఒకసారి పూర్తిగా తిరగడానికి సగటున 24 గంటలు లేదా 86,400 సెకండ్లకు సమానం. కానీ వాస్తవానికి ప్రతి రెండు భ్రమణాలకు మధ్య కొంత వ్యత్యాసం ఉంటుంది. చంద్రుడి గురుత్వాకర్షణ, వాతావరణ మార్పులు, భూమి లోపలి ద్రవ కేంద్రం వంటి పలు అంశాల దీనిపై ప్రభావం చూపిస్తాయి. అందువల్ల కచ్చితంగా 86,400 సెకండ్ల వ్యవధిలోనే కాకుండా కాస్త అటూ ఇటూగా ఒక భ్రమణం పూర్తి అవుతుంటుంది. ఈ భూ భ్రమణ తీరును, దానికి తీసుకున్న సమయాన్ని కొన్ని సంస్థలు నిరంతరం కాలమానంలో మిగిలిపోతోంది. అందువల్ల నాలుగేళ్లకోసారి ఒకరోజును అదనంగా ఫిబ్రవరి నెలలో కలుపుతున్నారు. అలా నాలుగేళ్లకోసారి ఫిబ్రవరి నెలలో 29 రోజులు వచ్చిన సంవత్సరాన్ని లీపు సంవత్సరంగా పరిగణిస్తున్నారు. అదేమాదిరిగా భూమి తన చుట్టూ తాను తిరగడాన్ని ఒకరోజు అంటే 24 గంటలుగా పరిగణిస్తున్నా.. దాని భ్రమణ వేగాన్ని బట్టి అంటే మందగిస్తే 24 గంటలకంటే ఎక్కువ పట్టడం, వేగం పెరిగితే 24 గంటలకంటే తక్కువ సమయం పట్టడం వల్ల ఆ హెచ్చుతగ్గులను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. భూభ్రమణ వేగం తగ్గి కాల వ్యత్యాసం 0.9 సెకన్లకు చేరినప్పుడు యూటీసీ సమయానికి ఒక సెకండును కలుపుతారు. దాన్నే లీపు సెకండు అంటారు.

## అణు గడియారాల సాయంతో

రోజులో ఒక సెకండు వ్యత్యాసమే కదా.. అనుకోవచ్చు. కానీ దీర్ఘకాలంలో ఉపగ్రహాలు (శాటిలైట్స్), జీపీఎస్, అంతర్జాతీయ కమ్యూనికేషన్ నెట్‌వర్క్స్, కంప్యూటర్లు వంటి సున్నిత వ్యవస్థలపై మామూలుగా కంటే 1.66 మిల్లీసెకండ్ల ముందే రోజు ముగిసి అతి పొట్టి దినంగా రికార్డులకు ఎక్కింది. అణు గడియారాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇలాంటిది గమనించటం అదే తొలిసారి. అయితే 1972 నుంచి రోజులు కాస్త త్వరగా ముగుస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూ భ్రమణ వేగంలో వ్యత్యాసాలు చాలాసార్లు కొద్దికాలమే ఉంటాయి. అందువల్ల పెద్ద వ్యత్యాసంగా కనిపించదు. ఒక ఏడాదిలో దీన్ని అంచనా వేయడం కష్టమే. కానీ ఇటీవల పొట్టి రోజులు ఎక్కువుతున్న ఒదున ఒక సెకండును తొలగించే అవకాశాలూ పెరుగుతున్నాయి. ఇప్పటి నుంచి 2035 మధ్యలో దీనికి 40% వరకు అవకాశముందని వివరిస్తున్నారు.

## భూమి వేగానికి కారణమేంటి?

భూ భ్రమణ వేగంలో ఈ వ్యత్యాసాలకు చాలా అంశాలు కారణమవుతుంటాయి. చంద్రుడు, సముద్ర అలలు గణనీయమైన ప్రభావం చూపుతాయి.

పర్యవేక్షిస్తుంటాయి. ఇంటర్నేషనల్ ఎర్త్ రొటేషన్ అండ్ రిఫరెన్స్ సిస్టమ్ సర్వీసు, యూఎస్ నేవల్ అబ్జర్వేటరీ తాజా సమాచారం ప్రకారం.. జులై 10న 24 గంటల కంటే 1.36 మిల్లీసెకండ్ల ముందే రోజు పూర్తయ్యింది. ఈ సంవత్సరంలో ఇప్పటివరకూ ఇదే అతి తక్కువ నిడివి గల రోజు. ఇక జులై 22న 1.34 మిల్లీసెకండ్ల ముందే రోజు పూర్తి కాగా.. ఆగస్టు 5న 1.25 సెకండ్ల ముందు రోజు ముగిసింది. సాధారణంగా భూమి సూర్యుడి చుట్టూ ఒకసారి తిరగడానికి 365 రోజుల కంటే ఒక పావు వంతు రోజు ఎక్కువే పడుతుంది. కానీ 365 రోజులనే ఒక సంవత్సరంగా పరిగణిస్తున్నారు. దాని వల్ల ప్రతి సంవత్సరం 0.25 అంటే పావు రోజు ప్రభావం చూపొచ్చు. అందుకే శాస్త్రవేత్తలు కచ్చితంగా లెక్కించే అధునాతన అణు గడియారాల సాయంతో నిరంతరం సమయాన్ని పర్యవేక్షిస్తుంటారు. దీన్నే కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్‌గా పిలుస్తున్నారు. దీన్నే ప్రామాణికంగా తీసుకుని అన్ని ఫోన్లు, కంప్యూటర్లలోనూ సమయాన్ని నిర్దేశిస్తారు. మరోవైపు శాస్త్రవేత్తలు ఉపగ్రహాల ద్వారా భూమి భ్రమణాన్ని పర్యవేక్షిస్తుంటారు. స్థిర తారలతో పోల్చి చూడటం ద్వారా భూమి స్థితిని తనిఖీ చేస్తుంటారు. ఒకసారి భూమి తన చుట్టూ తాను తిరగటానికి పట్టిన కాలం.. అణు గడియారాల సమయం మధ్య తేడాలేవైనా ఉన్నాయేమోనని గమనిస్తుంటారు. గత ఏడాది జులై 5న చంద్రుడు భూమి చుట్టూ సరిగ్గా వృత్తాకారంలో ఏమీ తిరగడు. భూమధ్యరేఖ నుంచి వీలైనంత ఎక్కువ దూరంలో ఉన్నప్పుడు భూమి భ్రమణ వేగం పెరుగుతుంది. వేసవిలో సహజంగానే భూమి కాస్త ఎక్కువ వేగంతో తిరుగుతుంది. గురుత్వాకర్షణ, గాలులు, నీటి సాంద్రత వల్ల సముద్ర జలాలు కదలటం.. కాలాల మార్పులు భూమి వేగాన్ని ప్రభావితం చేస్తాయి. మరోవైపు భూమిలోని ద్రవ అంతర్భాగ వేగమూ గత 50 ఏళ్లుగా నెమ్మదిస్తోంది. దీంతో దాని చుట్టూ ఉన్న ఘన భూమి వేగం పెరుగుతోంది. ఈ పరిణామాలను చూస్తే భవిష్యత్తులో రోజు కాలం తగ్గటం తథ్యంగా కనిపిస్తోంది.

## కలపడమే.. తగ్గింపు లేదు

భూ భ్రమణానికి అనుగుణంగా శాస్త్రవేత్తలు అణు గడియారాల సమయాన్ని సవరిస్తుంటారు. వ్యత్యాసాలను బట్టి ఒక సెకండు తగ్గించటమో.. కలపటమో చేస్తుంటారు. ఇప్పటివరకూ లీప్ సెకండ్లను కలపటమే గానీ తీయటమనేది జరగలేదు. మొత్తం మీద 27 లీప్ సెకండ్లను యూటీసీకి కలిపారు. అయితే భూ భ్రమణ వేగం పెరగటం వల్ల 1972 నుంచి వీటిని కలపటం నెమ్మదించింది. 70 దశకంలో తొమ్మిది లీప్ సెకండ్లను కలపగా.. 2016 నుంచి ఒక్క సెకండునైనా కలపలేదు. 2035 కల్లా లీప్ సెకండ్లు కలపడాన్ని విరమించుకోవాలని 2022లో నిర్ణయించారు. కానీ భూ భ్రమణ వేగం ఇలాగే కొన్నేళ్ల పాటు పెరుగుతూ పోతే యూటీసీ నుంచి ఒక సెకండును తొలగించే అవకాశముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# బాన్న వెంకటేష్ విజయం స్ఫూర్తిదాయకం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఆలిండియా 15వ ర్యాంకు విజేత, తమ పాఠశాల పూర్వ విద్యార్థి బాన్న వెంకటేష్ విజయం ఎందరికో స్ఫూర్తిదాయమని శర్వాణి విద్యాలయ అధినేత అంధవరపు సూరిబాబు కొనియాడారు. ఈమేరకు పాఠశాల ఆవరణలో బుధవారం వెంకటేష్ అభినందన సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంగా సిక్కోలులోని జలుమూరు మండలం, అల్లాడపేట వాసియైన తమ పాఠశాల విద్యార్థి బాణ్ణ వెంకటేష్ స్కూలు దశ నుండే జీవత గమ్యంపట్ల స్పష్టమైన అభిప్రాయాన్ని కలిగివుండేవారన్నారు. నేటి విద్యార్థులు వెంకటేష్‌ను స్ఫూర్తిగా తీసుకొని అసాధ్యాలను సుసాధ్యం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అకుంఠిత దీక్షతో, గమ్యం పై స్పష్టతతో అడుగులు ముందుకు వేయాలని సూచించారు. సంస్థ కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు మాట్లాడుతూ లక్ష్యసాధనలో అవాంతరాలు ఎన్ని వచ్చినా మొక్కవోని దీక్షతో ముందుకు సాగాలని వెంకటేష్ తన చేతలద్వారా నిరూపించారని కొనియాడారు. ఈ సందర్భంగా సివిల్స్ విజేత బాణ్ణ వెంకటేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శర్వాణిలో తాను నేర్చుకున్న క్రమశిక్షణ, ఫౌండేషన్ వలన ఈ స్థాయికి చేరుకున్నందుకు శర్వాణి మేనేజ్మెంటుకు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు. స్కూల్ దశ నుండే మన గమ్యం, మన ధ్యేయం నిర్దేశితమౌతుందన్నారు. కార్యక్రమములో భాగంగా విశ్రాంత ప్రధాన ఆచార్యులు నిక్కు అప్పన్న, ప్రముఖ న్యాయవాది కాశీవిశ్వనాథ్, నగర ప్రముఖులు ధర్మాన ఉదయ్ భాస్కర్‌లతో కలిసి సంస్థ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు దుశ్శాలువా, మెమెంటోతో బాణ్ణ వెంకటేష్‌ను సత్కరించారు. కార్యక్రమములో బాణ్ణ వెంకటేష్ తండ్రి చంద్రరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారంను శాశ్వతంగా వినియోగించాలి



**(సత్యంన్యూస్, పొందూరు)**

స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం వినియోగిస్తున్న ఒకటోనెంబరు ప్లాట్ ఫామ్‌ను శాశ్వతంగా కొనసాగించాలని స్థానిక రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు స్టేషన్ సూపరింటెండెంట్‌కు బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. తాము సమర్పించిన ఈ మెమోరాండాన్ని విశాఖపట్నం డివిజినల్ మేనేజర్‌కు తగు చర్యల కోసం పంపాలని కోరారు. విశాఖపట్నం వైపు వెళ్ళే పాసింజర్లు, ఎక్స్‌ప్రెస్ ట్రైన్స్ ఒకటోనెంబరు ప్లాట్‌పారంపై నిలిపినట్లయితే సీనియర్ సిటిజన్లకు చిన్నపిల్లలతో ఉండే తల్లులు, దివ్యాంగులకు అనుకూలంగా ఉంటుందన్నారు. అలాగే విశాఖపట్నం వైపు వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్‌లు అన్నీ మధ్యాహ్నం దాదాపు ఒకే సమయంలో వెళుతున్నందున ప్రయాణికులకు ఇబ్బందిగా ఉన్న విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లారు. బ్రహ్మపుర ఎక్స్ప్రెస్ ఉదయం 7 గంటలకు బయలుదేరి పొందూరు 9గంటలకు చేరిన పొందూరు పరిసర ప్రాంతాల వారందరికీ కూడా చాలా అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నాళం పైడిరాజు, పి.ఎస్. ప్రకాశరావు, బలివాడ గోవిందరావు, పి.దివాకర్ పాత్రో, ఎ.విజయ కుమార్, బి.జనార్దనరావు, వడగా సూర్యారావు తదితరులున్నారు.

# నేరాలను ప్రాథమిక దశలోనే తెలపండి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సమాజంలో జరుగుతున్న అక్రమాలు అన్యాయాలు పోలీసుల దృష్టికి ప్రారంభ దశలోనే చేర్చాలని టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు పేర్కొన్నారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు చేపడుతున్న నారీశక్తి అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పుణ్యపు వీధిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖ స్నేహపూర్వక సేవలకు ముందుకు వచ్చినప్పటికీ చాలామంది పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారన్నారు. దీనివలన సైబర్‌క్రైమ్, గృహహింస వంటివి తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మహిళా సంఘాలను, స్వయం సహాయక సంఘాలను, ఇతర మహిళలను అందరిని చైతన్య పరచాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఇందుకోసం శ్రీకాకుళం పట్టణంలో వార్డు సచివాలయాల పరిధిలో ఈ సదస్సులని నిర్వహిస్తున్నామని తెలియజేశారు.



మహిళా సంరక్షణ అధికారిణి వావిలపల్లి సుమన మాట్లాడుతూ సమస్య చిన్నదిగా ఉన్నప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో 35 స్వయం సహాయక సంఘాల మహిళలు స్థానిక ప్రజలు హాజరయ్యారు ఈ కార్యక్రమంలో వార్డు ఇన్చార్జ్ నవీన్, మహిళాసంఘ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం జ్యోతి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు అందించిన సహకారం గొప్పది

**(సత్యంన్యూస్, ఆమదాలవలస)**

శ్రీకాకుళం జిల్లా ఫిజికల్ సైన్స్‌టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో తయారు చేయబడిన ఫిజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆమదాలవలస ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పైల రవికుమార్, ఎస్‌అరుణ, బంగారు శరత్ కుమారిలు పాఠశాల 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఉచితంగా అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమదాలవలస మండల విద్యాశాఖ అధికారి కే.ఏ.రాములు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఉపాధ్యాయులు అందించిన సహకారానికి అభినందనలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, సాధించేవరకు కృషి చేయాలన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పి.రవికుమార్ మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత తయారు చేయబడిన స్టడీ మెటీరియల్ మంచి ఫలితాలు ఇస్తుందని, ఫిజికల్ సైన్స్‌ను నిత్యజీవితంలో వినియోగించుకోవాలని ఎస్.అరుణ పేర్కొన్నారు. స్టాఫ్ సెక్రటరీ పి.రామస్వామినాయుడు, జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు పి.మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ని వినియోగించుకోవాలని, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు గురుగుబిల్లి అప్పారావు, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ఎం.ఉమాకుమారి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు జి.కుమారి, జన విజ్ఞాన వేదిక విద్యా విభాగం రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.















## రిటైర్డ్ ఉద్యోగులకు
# కోటక్ మహీంద్రా బ్యాంకు సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రైవేట్ రంగంలో శరవేగంగా ఎదిగిని కోటక్ మహీంద్రా బ్యాంకు పాతికేళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బ్యాంకు శ్రీకాకుళం బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో సుమారు 50 మంది రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించి గౌరవించారు. వాస్తవానికి సంస్థ వార్షికోత్సవం అనగానే.. అందులోని ఉద్యోగులనే సన్మానిస్తుంటారు. కానీ కోటక్ మహీంద్రా బ్యాంకును మరింతగా జనంలోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో బ్యాంకుతో సంబంధంలేని రిటైర్డ్ సిటిజన్లకు పౌర సత్కారం చేశామని బ్యాంకు శ్రీకాకుళం బ్రాంచ్ మేనేజర్ భాగ్యరాజ్ చెప్పారు. బ్యాంకుకు చెందిన ఏపీ, తెలంగాణ జోనల్ హెడ్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

# ఇచ్చుకో వంద.. ఇదీ అక్కడి దందా!

మొదటిపేజీ తరువాయి

ఆ పత్రాల్లో చొప్పిస్తున్నారు. దీనివల్ల తమకు అవసరమైన సమాచారం కోసం 30 కంటే ఎక్కువ ఎంట్రీల నుంచి వెతుక్కోవలసి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే అదనపు డబ్బు అందదన్న దుగ్ధతోనే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా వినియోగదారులను ప్రేరేపించడానికే ఇలాంటి ఎత్తుగడలు అమలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

**అనవసర కొర్రీలతో ఇబ్బందులు**

ప్రత్యేకంగా అభివృద్ధి చేసే లే అవుట్లలో ఫ్లాట్ల క్రయవిక్రయాల విషయంలో సబ్ రిజిస్ట్రార్లు కొత్త కొర్రీలు పెడుతున్నారని తెలిసింది. లేఅవుట్లకు ప్రభుత్వం ఎల్‌పీ నెంబర్లను మాత్రమే కేటాయిస్తుంది. కానీ ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్లు ఎల్‌పీఎం నెంబర్లు కావాలని వినియోగదారులను డిమాండ్ చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. భూముల రీసర్వే తర్వాత మాత్రమే సర్వే నెంబర్ల స్థానంలో ఎల్‌పీఎం నెంబర్లను ప్రభుత్వం కేటాయించింది. కానీ ఈ రీసర్వే నుంచి లే అవుట్లను మినహాయించారు. అయినా సబ్ రిజిస్ట్రార్లు ఎల్పీ నెంబరుకు బదులు ఎల్‌పీఎం నెంబర్ నమోదు చేయాలని కోరడం కొత్త సమస్యలకు దారి తీస్తోంది. ఇదే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా జీపీతో రిజిస్ట్రేషన్ చేయాలనుకునేవారికి చుక్కెదురువుతోంది. జీపీ హోల్డర్‌తో పాటు జీపీ ఇచ్చిన ఆసామికి ఆధార్‌తో లింక్ అయిన ఫోన్‌కు ఓటీపీ పంపిస్తున్నారు. ఇద్దరికీ వేర్వేరుగా పంపించే ఓటీపీలు ఎంట్రీ చేస్తే తప్ప రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగదు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా జీపీ రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. అయితే సబ్ రిజిస్ట్రార్లు అతి తెలివి ప్రదర్శించి జీపీల రిజిస్ట్రేషన్‌ను దొడ్డిదారిలో చేసేస్తూ భారీగా డబ్బులు దండుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. జీపీ హోల్డర్‌నే జీపీ ఇచ్చిన యజమానిగా ఎంట్రీ చేసి సబ్‌రిజిస్ట్రార్ సూచించిన ఫోన్ నెంబర్లకు ఆధార్‌ను అనుసంధానం చేయించి వాటికి ఓటీపీలు పంపించి రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. దీనివల్ల అప్పటికప్పుడు వ్యవహారం చక్కబెట్టవచ్చేమో గానీ జీపీతో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న కొనుగోలుదారులు భవిష్యత్తులో సమస్యలు ఎదుర్కొక తప్పదని డాక్యుమెంట్ రైటర్స్ చెబుతున్నారు. ఈ విధంగా రిజిస్ట్రేషన్ చేయడం ప్రభుత్వ మార్గదర్శకాలకు వ్యతిరేకమని చెబుతున్నారు. జీపీ ఇచ్చిన వ్యక్తి దీన్ని వ్యతిరేకిస్తే కొనుగోలుదారులకు సమస్య తప్పదని హెచ్చరిస్తున్నారు.

## మీకూ నాకూ పదవులిచ్చిన
# రాహుల్ తెలివితక్కువవాడే..!

**నల్లారిపై విరుచుకుపడిన కిల్లి**

(సత్యంన్యూస్, టెక్కలి)



అత్యంత పెద్ద రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చరిత్రపుటల్లో నిలిచే విధంగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి స్థానం కల్పించిన రాహుల్ గాంధీ తెలివితక్కువవారేనని మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. ఓట్ చోర్ ఉద్యమంలో ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరు, దాని వెనుక కేంద్ర ప్రభుత్వం ఉన్న అంశాన్ని బయట పెడుతున్న రాహుల్‌గాంధీకి తెలివితేటలు లేవని, కనీసం తెలివైన వారిని పక్కన పెట్టుకోవాలి కదా.. అంటూ కిరణ్‌కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కృపారాణి తప్పుపట్టారు. కాంగ్రెస్‌లో కిరణ్‌కుమార్ రెడ్డి తండ్రి అమర్నాథ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం తెలివితక్కువతనమేనని, ఒక వెనుకబడిన జిల్లాలో వెనుకబడిన తరగతులకు చెందిన మహిళనైన తనకు కేంద్రమంత్రి పదవి ఇచ్చిన సోనియా, రాహుల్‌లు తెలివితక్కువ వారేనని కిల్లి కృపారాణి వ్యంగ్యంగా విమర్శించారు. రెండుసార్లు ప్రధానమంత్రి పదవి వద్దనుకున్న కుటుంబం తెలివితక్కువది కాకపోతే మరేమవుతుందని ఆమె అన్నారు. దేశం ఆకలితో అలమటించిపోతుంటే తన యావదాస్తి అమ్మేస్తే ఆరు నెలల దేశం ఆకలి తీరుతుందని, ఆస్తులను దారాదత్తం చేసిన నెహ్రూ కుటుంబం తెలివితక్కువదేనని ఆమె అన్నారు.

దేశం ముక్కలు కాకూడదని తుపాకీ తూటాలకు ఇందిరాగాంధీ బలవడం, పక్క దేశం కూడా శాంతియుతంగా ఉండాలని రాహుల్ తండ్రి భావించడం తెలివితక్కువతనం కాకపోతే మరేమిటని ఆమె అన్నారు. రాహుల్ గాంధీ తెలివితక్కువ వాడు కాబట్టే దశాబ్దాల పాటు ఏ పదవీ లేకుండా జోడో యాత్ర, న్యాయ యాత్ర పేరిట దేశం మొత్తం తిరుగుతున్నారని, మన లాంటివారందరికీ పదవుల్లో కూర్చోబెట్టారని ఆమె విమర్శించారు.

## రాష్ట్ర సబ్ క్యాబినెట్ కమిటీ దృష్టికి
# 'మురపాక మండలం'

(సత్యంన్యూస్, అమరావతి)



రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణపై వేసిన క్యాబినెట్ సబ్ కమిటీ మొదటిసారి వెలగపూడి సచివాలయంలో సమావేశం అయిన నేపథ్యంలో శ్రీ వివేకానంద యూత్ సొసైటీ ఎస్‌వీవైఎస్ ఆధ్వర్యంలో మురపాక మండలం సాధన సమితి సభ్యులు జీవోఎం (గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్)కి వినతిపత్రం అందజేశారు. శ్రీ వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షులు బాలి శ్రీనివాసనాయుడు మురపాక మండలం ఏర్పాటు ఆవశ్యకతను క్యాబినెట్ సబ్ కమిటీకి వివరించారు. మురపాక మండలం ఏర్పాటుని పరిగణలోనికి తీసుకుంటామని జీవోఎం తెలియజేసిందని ఎంఎంఎస్ సభ్యులు తెలిపారు. 1989లో మురపాక మండలం ఏర్పడుతూ గెజిట్ నోటిఫికేషన్ వచ్చిందని, ప్రస్తుతం మండల కేంద్రం లావేరు, మురపాక గ్రామానికి 17 కిలోమీటర్ల దూరంగా ఉండటం వల్ల జాతీయ రహదారి దాటుకుని వెళ్లాల్సి వస్తుందని, పలు రకాల ప్రమాదాలకి గురి కావాల్సి వస్తుందని వివరించారు. 11 పంచాయతీల, 32 గ్రామాల ఆకాంక్షని ఆయా పంచాయతీల సర్పంచులు తీర్మానాల రూపంలో అందజేశారని, వాటిని జీవోఎం సబ్ కమిటీ దృష్టికి తీసుకుని వెళ్లామని మురపాక మండల సాధన సమితి ఎంఎంఎస్ సభ్యులు మీసాల రమణ, పెయ్యల లక్ష్మణరావు తెలిపారు. త్వరలో జిల్లాల్లో పర్యటిస్తామని, అప్పుడు మళ్లీ వినతులు స్వీకరిస్తామని మంత్రులు తెలిపారని ఎంఎంఎస్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మీసాల భానోజీరావు, నాజాన లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని జిల్లాల్లోని తూర్పుకాపులకు ఓబీసీ వర్తింపజేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న తూర్పుకాపులందరికీ ఓబీసీ రిజర్వేషన్ వర్తించేలా పార్లమెంట్‌లో బిల్లుపెట్టి తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని బీజేపీ జాతీయ అధికారప్రతినిధి, మాజీ రాజ్యసభసభ్యులు జీవీఎల్ నరసింహారావును సంఘ ప్రతినిధులు కోరారు. ఈమేరకు న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి అన్ని అంశాలను ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, ఏపీటీకే జేఏసీ రాష్ట్ర చైర్మన్ గిరడా అప్పలస్వామి, ఏపీటీకేఎస్ఎస్ ఓబీసీ సాధన కమిటీ చైర్మన్ పల్లా వెంకటరావు, ఏపీటీకే జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిశెట్టి అచ్చెనాయుడు, ఏపీటీకేఎస్ఎస్ ఓబీసీ సాధన కమిటీ సభ్యులు అప్పారావు నివేదించారు. దీనిపై నరసింహారావు స్పందిస్తూ ఓబీసీ రిజర్వేషన్ అంశంపై ఇప్పటికే ఎన్‌సీబీసీ కమిషన్ భారత ప్రభుత్వానికి రాష్ట్ర వ్యాప్తంగా ఓబీసీ రిజర్వేషన్ కల్పించేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని నివేదిక ఇచ్చిందన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సంపూర్ణమైన నివేదిక కేంద్ర ప్రభుత్వానికి మరోమారు పంపించాల్సి ఉందని, ఆ దిశగా ప్రక్రియ పూర్తయిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తూర్పుకాపులందరికీ ఓబీసీ రిజర్వేషన్ అమలుపరిచేలా పార్లమెంట్‌లో బిల్లు తీసుకొచ్చి తూర్పుకాపులకు న్యాయం జరిగేలా అన్నివిధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు.

# కొంక్యాన గోవిందరాజులు ట్రస్ట్ వితరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోవిందరాజులు 15వ వర్ధంతి సందర్భంగా నగరంలోని మదర్‌థెరిసా హోంలో వృద్ధులు, దివ్యాంగులకు బుధవారం భోజన వితరణ చేపట్టారు. మదర్ థెరిసా హోంకు వాటర్‌ఫిల్టర్ అవసరమని నిర్వాహకులు కోరగా 50 లీటర్ల వాటర్‌ఫిల్టర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కొంక్యాన మురళీధర్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కోట సావిత్రమ్మ, కొన్న నర్సింహమూర్తి, కొంక్యాన రాధాకృష్ణ, కొన్న సదాలక్ష్మి, పెద్దింటి గాయత్రిదేవి, కొంక్యాన వేణుగోపాల్, సరోజ, కొంక్యాన శివశంకర్, శిష్టు లిఖిత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# లెక్చరర్‌కు ఘన సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలో పలు డిగ్రీ కళాశాలలతోపాటు ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్ విధులు నిర్వహిస్తున్న కొండవలస సురేష్ కుమార్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా ఉత్తమ విద్యాబోధన అందిస్తూ సేవా కార్యక్రమాల నిర్వహణలో గుర్తింపు పొందిన వారిని సత్కరించాలని ఫౌండేషన్ (విశాఖపట్నం) భావించింది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం నుంచి సురేష్‌కుమార్ విశాఖ గ్రంథాలయం ఆడిటోరియంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయనను సత్కరించి జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఎస్–ఎస్ఆర్ డిగ్రీ, వేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా సేవలందిస్తు మన్ననలు పొందుతున్న నేపథ్యంలో విశాఖలో ప్రాన్ క్వీన్ టెక్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.శివకుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సురేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఢిల్లీ నుండి నెల్లి గురుదేవ్ దత్, ఆచార్య కృష్ణ, కాలేజ్ ప్రిన్సిపాల్ ఫౌండేషన్ చైర్మన్ పలువురు ఆచార్యులు బి.శ్రీరామమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.



# కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టొద్దు

(సత్యంన్యూస్, పలాస)

వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్న మోడీ విధానాలకు నిరసనగా బుధవారం క్విట్ కార్పొరేట్‌డేను సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో పలాసలో జరిగింది. ఈ సందర్భంగా కాశీబుగ్గ పెంట దాలయ్య ఆశ్రమం నుండి పాత బస్టాండ్, శ్రీనివాస జక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ఎ.ఐ.కె.యం జిల్లా కార్యదర్శి మద్దిల రామారావు, సీఐటియు జిల్లా కార్యదర్శి యన్.గణపతి, ఐర్ల జిల్లా కార్యదర్శి టి.సన్యాసిరావు, ఆంధ్రప్రదేశ్ జీడిరైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ కంపెనీలను రానీయవద్దన్నారు. ట్రంప్ విధించిన 50శాతం సుంకాలను వెంటనే ఉపసంహరించాలన్నారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను విరమించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో 3వసారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం రద్దయిన 3నల్లచట్టాల కన్నా ప్రమాదకరమైన విధానాలను దొడ్డిదారిలో అమలు చేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తమ్మినేని భాస్కరరావు, బి.వాసు, కె.దుస్యంతు, కౌలు రైతు సంఘం నాయకులు బి.ఆనందరావు, రవి, తెప్పల రాజు, జి.నీలకంఠం, యన్.దిల్లీశ్వరి, మట్ట ధర్మారావు, లక్ష్మీనారాయణ, గోవిందు, జె.వీరస్వామి, జి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు




# ముగిసిన విద్యార్థుల పోటీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ప్రసంగం, చిత్రలేఖన పోటీలు గత రెండు రోజులుగా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఉత్సాహంగా జరిగి ముగిశాయి. ప్రభుత్వ, మోడల్, సోషల్ వెల్ఫేర్, కస్తూర్బా, ట్రైబల్ వెల్ఫేర్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్ విద్యార్థులు పోటీల్లో తమ ప్రతిభను ఆవిష్కరించారు. ఇందులో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు గురువారం ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో తలపడనున్నారు. ఈ సందర్భంగా ఆర్.ఐ.ఓ, జిల్లా ఉపాధి అధికారి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# జరిగింది పొరపాటు.. చేస్తారా సర్దుబాటు?

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్ష పదవి నుంచి తప్పించి తెలగ సామాజికవర్గానికి చెందిన అడపా చంద్రశేఖర్‌కు ఇచ్చారు. ఇదే సమయంలో సారవకోట మండలానికి చెందిన ధర్మాన తేజకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆశీస్సులు ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి చిట్టి నాగభూషణం తనకు ఓ సిఫార్సు లేఖ ఇవ్వాలంటూ స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ఆమధ్య కోరారు. అయితే ఇద్దరు మంత్రులు ఇదే సామాజికవర్గం నుంచి ఉండటం వల్ల వారి మాటే చెల్లుబాటవుతుందని, తన అభిప్రాయం అడిగితే మాత్రం చిట్టి నాగభూషణం పేరు చెబుతానని చెప్పడంతో ఆ కథ అక్కడితో ముగిసింది. ఇక శిష్టకరణ కార్పొరేషన్ ఛైర్మన్‌ను ఈ 31 మంది జాబితాలో ప్రకటిస్తారని అంతా భావించారు. కానీ మంగళవారం నాటి లిస్టులో ఈ కులం లేదు. త్వరలో భర్తీ కాబోయే 20 కార్పొరేషన్లలో కళింగకోమట్లు, శిష్టకరణాలు, పోలినాటి వెలమలు ఉంటారని భావిస్తున్నారు. శిష్టకరణ కార్పొరేషన్‌కు కూడా పెద్ద ఎత్తున పోటీ ఉండగా మచిలీపట్నానికి చెందిన ప్రస్తుత శిష్టకరణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అక్కుమహంతి రాజా పేరు మొదటి వరుసలో ఉంది. రాజాం, పార్వతీపురం వంటి ప్రాంతాల నుంచి కూడా ఈ పదవికి పోటీ పడుతున్నా కొందరు మాత్రం వైకాపా నుంచి టీడీపీలోకి రావడం వల్ల పార్టీ ఆ కోణంలో ఆలోచిస్తుందన్నవారూ లేకపోలేదు. కళింగకోమటి కార్పొరేషన్‌కు సంబంధించి బోయిన గోవిందరాజులు, కోరాడ హరిగోపాల్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇప్పుడు కళింగకోమటి కార్పొరేషన్‌కు చైర్మన్‌గా తప్పుగా ప్రకటించిన మొదలవలస రమేష్‌ను ఏం చేస్తారనేది తేలాల్సిన ప్రశ్న. ఆయన కులానికి సంబంధించిన కార్పొరేషన్ పోస్టు ఇంతకు ముందే భర్తీ అయిపోవడంతో మొదలవలస రమేష్‌ను రాష్ట్రస్థాయి కార్పొరేషన్లు అయిన ఫైబర్‌నెట్, సీడ్ కార్పొరేషన్, ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటి ప్రాధాన్యత గల సంస్థల చైర్మన్ ఇస్తారని తెలుస్తోంది. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా బుధవారం మధ్యాహ్నం పార్టీ కార్యాలయానికి వెళ్లి మొదలవలస భవితవ్యాన్ని తేల్చనున్నారు.



నగర పరిధి కంపోస్ట్ కాలనీలో పెద్ది కవిత తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట కూటమి కార్యకర్తలున్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

# 15న కృష్ణాష్టమి వేడుకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 15న సాయంత్రం 5 గంటల నుండి నుండి 8గంటల వరకు, ఇలిసిపురం సాయిబాబా గుడి ఎదురుగా, బ్రహ్మకుమారిస్ ప్రాంగణంలో కృష్ణాష్టమి శుభాకాంక్షలు వేడుకలు ఘనంగా జరగనున్నాయని బ్రహ్మకుమారిస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలలో భాగంగా శ్రీకృష్ణుని వేషధారణలు, అలంకరణలు, గుజరాతీపేట రాజరాజేశ్వరి కోలాట బృందం ఆధ్వర్యంలో కోలాటాలు, శ్రీకృష్ణుని రాసలీలలు ఆకర్షణగా నిలుస్తాయని, కోలాటాలను వీక్షించి భగవంతుని కృపకు పాత్రులుకాగలరన్నారు.

# పేదల బియ్యం పక్క దారి

(సత్యం న్యూస్ కొత్తూరు)

ప్రభుత్వం పేద ప్రజలకు రేషన్ డిపోల ద్వారా బియ్యాన్ని అక్రమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. ఆంధ్ర ఒరిస్సా రాష్ట్ర సరిహద్దు నియోజకవర్గమైన పాతపట్నంలో సుమారుగా ప్రతినెల 500క్వింటాళ్లకు పైనే రాష్ట్ర సరిహద్దులు దాటిపోతున్నా అధికారులు మాత్రం తూతూ మంత్రంగా పట్టుకొని చేతులు దులిపేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతినెల ఒకటి రెండు వారాల్లో టూవీలర్లపై పెద్ద ఎత్తున హడ్డుబంగిలోని ఒక వ్యాపారికి వందల క్వింటాళ్ల బియ్యాన్ని సరిహద్దు గ్రామాల వ్యాపారస్తులు చేర్చి వేస్తున్న అధికారులు నిమ్మకి నీరుతున్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు సత్యంలో కథనాలు ప్రచురితమైనా చట్టాలలోని కొన్ని రకాల సాంకేతిక పరమైన సమస్యల మూలంగా తక్కువ మొత్తంలో ఎగుమతి చేస్తున్న వ్యక్తులను పట్టుకోవడం ఆసాధ్యమని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సీతంపేట నుండి ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలోని ఒక రైసుమిల్లుకు తరలిస్తూ ఉండగా కొత్తూరు మండలం మాతల గ్రామం వద్ద 140 బస్తాల పిడిఎస్ రైస్‌ను విజిలెన్స్ అధికారులు పట్టుకొని కొత్తూరు తహశీల్దార్ కార్యాలయానికి సివిల్ సప్లై డీటీ భీమారావుతో విజిలెన్స్ అధికారులు తరలించారు. అధికారులు డ్రైవర్లను ప్రశ్నించగా కనుము గ్రామానికి చెందిన గోవిందరావుకి చెందినదిగా తెలియజేశారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.